# సాహితీ సత్కారం

ఇచ్ఛాపురపు రామచంద్రం

**కవిగారు కళ్ళు తెరిచేసరికి— కాలమానం పగలు పదిగంటలు వారి మంచానికి చేరువలో ఉన్న బల్లమీది కాఫీ ఫ్లాస్కూ, వార్తాపత్రికా, దాని పక్కనే పదిహేనిరవై ఉత్తరాలూ — వారికి సుప్రభాతం పలికాయి.**

**నిజానికి వారు కవిగారు కానేకారు కవికీ రచయితకీ భేదం తెలియకనో, నిరంతరమూ కారాకిళ్లీ వేసుకుంటారనో వారిని చాలామంది కవిగారనే అంటారు. వారు కూడా కాదనరు.**

కవిగారు ప్రతిరోజూ ఉదయం పదిగంటల వరకూ పడుకుంటారని కాదు. వారి తాజా నవల బాగా అమ్ముడుపోయిందని గత రాత్రి విందు చేశాడు ప్రచురణ కర్త. విందంటే— మందూ పొందూ పొందుపరచిన పసందే. అన్నీ ఐ— కవిగారు కారులో ఇల్లూ, మంచమూ చేరుకునేసరికి గడియో గంటో తెల్లవారబోతోంది. ఆలస్యంగా నిదురించిన వారు ఆలస్యంగా లేవడంలో ఆశ్చర్యం లేదు కదా?

మంచం మీదే కాఫీ తాగి సిగరెట్ అంటించి... ఉత్తరాల బొత్తి అందుకున్నారు. పత్రికల వాళ్ళవీ పుస్తకాలవాళ్ళవీ పోగా మిగిలిన అభిమానుల ఉత్తరాల మధ్య ఒకటి కాకులమధ్య రాజహంసలా ప్రత్యేకంగా కనిపించింది. కవరు మీది చేతి వ్రాతను బట్టే ఆ ఉత్తరం రాసిందెవరో గ్రహించేసి... ఆ కవరుని తెరవకుండానే వేళ్ళతో సున్నితంగా రాస్తూ... మరో దఫా కాఫీ చప్పరించి, సిగరెట్ పీల్చారు. సుడులు తిరుగుతూ లేస్తున్న సిగరెట్ పొగను విలాసంగా చూస్తూ... పెదవులపై మందహాసం వొలికిస్తూంటే—

ఆయన మెదడు ఆయన కథలలో లాగా వెనక్కి వెళ్ళింది జ్ఞాపకాలలోకి. విశాఖపట్నంలో—ఏదో సాహితీ సంస్థ... సన్మాన సభ. సరేనన్నారు కాదనడం దేనికని.

"ఎలాగూ విశాఖపట్నం వెళ్తున్నారుగా. ఓ సారి అమ్మాయిని చూసి రారాదూ ఎలా ఉందో?" అన్నారు కవి శ్రీమతి గారు. అలాగే అని బయలుదేరారు.

సన్మాన వేదిక మీద కథ మామూలే. కార్యక్రమంలో బాగున్న అంశాలు రెండే. ధనంతో సన్మానించడమూ తనను రచయితగా సన్నుతించడమూ. మిగిలినవి చిరాకనిపించాయి. కార్యక్రమానంతరం "మీకు ప్రత్యేకమైన బస ఏర్పాటుచేశాం" అంటూ కారులో కార్యదర్శి నిజంగానే ఓ మంచి గదికి తీసుకువొచ్చి దింపి "మళ్ళీ కలుస్తా" నంటూ మాయమైపోయాడు.

నాలుగో అంతస్తులో ఒకే ఒక్క గది. నాలుగువేపులా డాబా. ఎదురుగా సముద్రం. దూరంగా కొండలు. పౌర్ణమేమో ఎటు చూసినా వెన్నెలా అందమూ.

సాహిత్య సభ తాలూకు చిరాకు నుంచి బయటపడడానికి వేడి నీళ్ళ స్నానం చేసి, వొంటిమీద యుడికొలోన్ జల్లుకుని — ఇస్త్రీ పంచె, లాల్చీ వేసుకుని — ముఖానికి పౌడరు రా(పూ)సుకున్నాడు. అమ్మాయి దగ్గరకి వెళ్ళొద్దామా అనుకునేంతలో—

మూలబల్లమీద సవినయంగా ఆహ్వానిస్తున్న రాయల్ శాల్యూట్! పక్కనే మంచు ముక్కల గాజు పాత్ర. వేటినో వేడిగా కడుపులో దాచుకున్న హాట్ ప్యాక్. మిలమిలమెరిసే గాజుగ్లాసులు, సోడా సీసాలూ

రాయవలసిన నవల గురించి కూడా ఆలోచించ బుద్ధికాలేదు. ముందు మందు తీసుకోడం మంచిదనిపించింది. కుర్రాడిని పిలిచి మధుసేవ సరంజామాని ఆరు బయట వెన్నెలలోకి చేరవేయమందామనుకునేంతలో—

వెన్నెల గాలులలో తేలివొస్తున్న పరిమళం, దాని వెనుక గాజుల గలగల...

అటు చూశాడు. గది గుమ్మంలో మదిదోచుకునే ముద్దులగుమ్మ. ఫ్రేములో ఫోటోలా ద్వారంలో నిలబడి "లోపలికి రావొచ్చునా?"

పద్దెనిమిది పైగా ఇరవై లోపు ప్రాయంగల పసిడి పాప. ఆ పుత్తడి బొమ్మలో సౌందర్యమూ యవ్వనమూ మిసమిసలాడుతున్నాయి.

"తప్పకుండా. సుస్వాగతమ్" నవ్వుతూ ఆహ్వానించాడు. తనకెదురుగా కుర్చీ చూపాడు.


"చాలా కృతజ్ఞతలు.. నేను మీ అభిమానిని. పేరు హనిత. బి.ఏ ఫైనలియర్. మిమ్మల్ని చూడాలని, ఇంటర్వ్యూ చేయాలని..."

"మీరేనా హనిత!? ఐతే మీరేం చేయదలుచుకున్నా నేను సంతోషంగా సిద్ధమే. నేనే మీకు కృతజ్ఞుడ్ని. నా రచన పడుతూంటే— మీ అభినందన ఉత్తరాలుండి తీరతాయి. మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడడం.. నాకు చాలా ఆనందంగా ఉంది" సుప్రసిద్ధత అనే సాలెపురుగు ఎరకోసం దారం అల్లుతోంది.

"బలేవారు! మీరేమో నంబర్ వన్ రైటర్! నేనేమో కథలు పడక ఉత్తరాలలోకి దిగిన ఉత్త ఉత్తరమ. మీరు మాట్లాడకండి. మీరేమీ అనుకోనంటే — ఒక్కమాట..."

ఆమె విశాల నయనాలలో వింతకాంతి! తన అభిమాన రచయితను తొలిసారిగా చూస్తూ మాట్లాడుతూ పొందే అనుభవానుభూతుల అనంత ఆనందం!

ఆమె విశాల నయనాలలో వింతకాంతి!
తన అభిమాన రచయితను తొలిసారిగా చూస్తూ,
మాట్లాడుతూ పొందే అనుభవానుభూతుల అనంత ఆనందం!

“మీ వంటి చక్కని అందమయిన అమ్మాయి — ఒక్క మాట కాదు, వేయి మాటలు చెప్పినా నాకు దివ్య సంగీతమే” అనుభవం — అమాయకత్వం మీద తొలివల విసిరాడు.

“మీరాతలే కాదు, మాటలూ చిత్రమే. మీ రంటే నాకు చాలా అభిమానమూ, ఆరాధనా” సిగ్గుతో, కళ్ళు కొంచెం కిందకు వొంచి— కంఠంలో సన్నని వొణుకుతో అంది.

“నేనంటేనా? నా రచనలంటేనా?” అంతా తెలిసిన వయసు, ఏమీ ఎరుగని ముగ్ధత్వాన్ని మాటలతో స్వార్థంతో తెలిసీ తెలియనితనాన్ని తెరవెనక్కి లాగాలని ప్రయత్నిస్తోంది.

“మిమ్మల్ని చూసిన క్షణం వరకూ మీ రచనలంటే, మిమ్మల్ని చూసిన క్షణం నుంచి మీరంటే కూడా. నాకిప్పుడు మీరూ మీ రచనలూ వేరుకాదు”

“ఓహో! మీరు పంచదార చిలుకే కాదు పలుకుల పల్లకీ కూడానే! మీరన్యథా భావించనంటే అర్థం చేసుకుని ఆమోదిస్తానంటే చిన్న అభ్యర్థన” అవసరం ఆరాధనమీద అందమయిన స్వార్థపు కుట్ర పన్నుతోంది.

“ఏమిటి?”

“హనితా! మీ అంత చక్కని.. తెలివయిన.. తీయగా మాట్లాడగలిగే అమ్మాయి నాకింతవరకూ ఇంత సన్నిహితంగా రాలేదు. దయతో మీరంగీకరిస్తే... ఇటుపై నా నవలలోని నాయికలకు స్ఫూర్తి మీరే ఔతారు...” ఆకర్షణ జాలం అందంగా పరిచాడతడామె చుట్టూ.

“నాకు.. నిజంగా... అంతవరమా! మీవంటి సుప్రసిద్ధ రచయితకు స్ఫూర్తి కాగలిగేంత అదృష్టం ప్రసాదిస్తున్నారా! నా జన్మ ధన్యమే అయింది” తడబడుతోందామె.

“అంత ఆవేశపడడానికేముంది? ఉద్విగ్నతను నిగ్రహించుకోండి” అంటూ ఆమె చేయందుకుని.. తన కన్నులకూ పెదవులకీ ఆన్చుకున్నాడు.

అప్సర్సలోని ఇంద్రజాలానికామె కన్నెమనసు కరిగిపోతోంది. వివేకం తలవొంచేస్తూ ఓడిపోతోంది "మీ ప్రతి రచనా నేనెన్నేసిసార్లు చదువుతానో! మీ నవలలంటే నాకెంతో ఇష్టమో..."

"నువ్వంటే నాకింత ఇష్టం..." వాక్యం పూర్తి చేశాడు ఆమె వేయి వొదలకుండానే.

మెల్లగా ఆమె భుజాల మీట్గా చెయ్యి పోనిచ్చి... దగ్గరగా తీసుకుంటూ... ఆమె చెవిలో "నువ్వంటే నాకిష్టం.... నువ్వంటే నాకు ప్రేమ... నువ్వు నా ప్రాణం..." లాటి తీపి గుసగుసలు ఆడుతూ ఆమెకి గిలిగంతలు పెడుతూ ఆమెను మెల్లగా వెన్నెలలోకి నడిపించేశాడు.

చల్లని గాలీ.... తెల్లని వెన్నెలా.

వెన్నెల! ఏ వయస్సువారినయినా వెర్రి వేడి ఎక్కించగలిగే పండు వెన్నెల!

"మీరెంత అందమయినవారు! పంచె, లాల్చీ వేసుకుంటే మన్మధుడు మీలాగే ఉంటాడేమో"

మన్మధుడికి గుండుండదని మనసులో అనుకుని — బయటకు నవ్వుతూ "మన్మధుడు రచయితా?" అడిగాడతను.

"కాదు. అందుకే మీరతనికంటే చాలా గొప్పవారు" ఆరాధనకెప్పుడూ ప్రాస్వదృష్టే.

"నీ అభినందనలకు సరితూగే కృతజ్ఞతలు తెలపాలంటే— మాటలు చాలవు" అంటూ ఆమె బుగ్గలమీదా పెదవులమీదా ముద్దులు ముద్రించాడు. మనసులో— సిరివొస్తానంటే మోకాలొడ్డరాదే, సిరిని మించిన కన్యాత్వసిరి వరిస్తానంటే వలదనడం నేరమూ దోషమూ కాదూ అని అంతరాత్మకు నచ్చజెప్పుకున్నాడు. అందులోనూ— ఇటువంటి సుందరి అయిన, అభిమాని అయిన... కన్య!

తిరువాత— అసాధ్యమూ, అసంభవమూ, అనూహ్యమూ అయిన ఎన్నో విషయాలు వారిద్దరి మధ్యా చకచకా జరిగిపోయాయి. ఔను ఆమె అతని పట్ల అభిమానమనే అంధకార బంధురంలో బందీ బపోయింది. ఇక విచక్షణ కవకాశమెక్కడ?

"నా రచనలలో మీకేది ఎక్కువ ఇష్టం?"

"దొంగాడు"

ఆ సమయంలో అతనికి కావలసింది అభిమానపు హారతి పళ్ళెంకాదు అందుచేత —

'నాకు మాత్రం నీ కౌగిలే ఎక్కువ ఇష్టం—"అన్నాడు కుటిలంగా నవ్వుతూ.

అలాగ ఆమెను వివశనే చేశాడు. ఆమె అతన్ని అల్లుకుపోయింది. గాఢంగా కౌగలించుకుంది. ముద్దులు చెల్లించింది. మురిపాలు తీర్చింది—

అన్నీ—ఆరాధనామైకంలో. అవధులు మీరిన అభిమానపు అంధకారంలో.

చివరికి ఇక తాళలేక "నా అందంతో మీకు విందు అందించనివ్వండి. నా యవ్వనాన్ని మీకు హారతివ్వనివ్వండి. ఓ మహారచయితా! నా అభిమానాన్నీ ఆరాధననీ వ్యక్తం చేసుకుందుకు ఇంత కంటే మార్గమేముంది?" అనేసింది. ఆ అదునుకోసమే ఎదురు చూస్తున్న అతను ఆమె నెత్తుకుని గదిలోకి తోవతీశాడు. తలుపులు మూశాడు. కిటికీలోంచి మాత్రం కావలసినంత వెన్నెలా, గాలీ ఆ గదే శోభనంగదే అయ్యింది. ఆమెకి ఆ రాత్రి మధురరాత్రే అయింది—

అతనికి.

తెల్లవారుతూనే వొచ్చాడు సెక్రటరీ "గది ఫరవాలేదుకదా? వెస్టిండీస్ క్రికెట్ టీమ్ ఊళ్ళోకి దిగడంతో ఇంతకంటే మంచి రూము చూడలేకపోయాం. క్షమించండి అసౌకర్యానికి"

"ఏమీ లేదు. గది చాలా బాగుంది" అంటూ అతనితో కారెక్కాడు రైలుకి వేళవుతుంటే ఆమె హనిత! ఇప్పటికీ ఇంకాఆమె కన్యా సౌందర్యం తన కనులముందు విరుస్తున్నట్లూ, విచ్చుకుంటున్నట్లే అనిపిస్తుంది. ఆ పసిడి సౌందర్యం తనముందు పరుమకుంటున్నట్లే...

ఎంత ఆరాధన! ఎంత అభిమానం! తన కలం బలం ఆమె కన్యత్వాన్నే కానుకగా తీసుకోగలిగింది! రచయితకు— అభిమాని దృష్టిలో వృద్ధాప్యమనేదే లేదు. అభిమాని అంతరంగంలో రచయిత నిత్య యువ్వనుడూ, నిరుపమాన సుందరుడూ. కాకపోతే ఆ రాత్రి తనకి అమృతం కురిసిన రాత్రి, ఆపున్నమి కాముని పున్నమీ ఎలా కాగలిగాయి? తను అంతగొప్పరచయిత అనుకుంటూ తన కలాన్ని ముద్దు పెట్టుకున్నారు కవిగారు. హనితతో ఆ అనుభవం ఐదు నెలల కిందట

* * *

ఈ ఉత్తరం ఆమెనుంచే

ఏం రాసిందో? మరోసారి విందుకి ఆహ్వానిస్తోందా

కవరు తెరవబోతూంటే—

కర్కశంగా టెలిఫోన్ మోత.

విసుగ్గా... కోపంగా అందుకున్నాడు "కవిగారేనా."

"నేను ఆంధ్రామెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ని. విశాఖపట్నం నుంచి"

"నమస్తే"

"ఇవేళ్టి 'ఈ దినం' పేపరు... ఐదవపేజీ.. ఓ మెడికో గురించి... వెంటనే చదవండి. మళ్ళీ కొంత సేపటిలో టెలిఫోన్ చేస్తాను"

కవిగారి కేమీ అర్థం కాలేదు.

మరో కాఫీ తాగి సిగరెట్ అంటించారు. అంతలో హనిత ఉత్తరం గుర్తుకొచ్చింది.

"నా అభిమాన రచయితా!


బాగున్నారు కదూ? మీరు కలకాలమూ బాగుండాలి. అదేనా ఆకాంక్ష. మీ తాజానవల — తెరతొలగింది చూడు— అత్యద్భుతంగా ఉంది. పత్రికలలో నా అభినందన లేఖలు చూస్తూనే ఉండి ఉంటారు. మీకు వ్యక్తిగతంగా రాయకపోడానికి ప్రత్యేక కారణమేమీ లేదు. మీ అమూల్యమైన కాలాన్ని నా అనవసరపు టుత్తరాలతో వృధా చేయకపోతే మీరాసమయంలో రచనలు చేస్తారని.

మీకు జ్ఞాపకముందా ఆ రాత్రి?

నా అభిమానమూ ఆరాధనా మీకు హారతిచ్చిన రాత్రి.

నా సౌందర్యపు కన్యాత్వాన్ని మీకు నైవేద్యం పెట్టిన రాత్రి. నా జన్మ ధన్యమయిన కలలు పండిన.. నా స్త్రీత్వం సఫలమయిన ఆ మధుర రాత్రి మీరూ మరచిపోలేరనే నా విశ్వాసం. మీకారాత్రి జ్ఞాపకముంటుందేమో అనే. ఆ రాత్రి నా పుణ్యం పండింది. ఆ దివ్యానుభవం తాలూకు అనుభూతి ఆకృతి దాల్చి శాశ్వతం కాబోతోంది. రచయితలు. మీకు అర్థం కాదనా? నా తృప్తికోసమే విడమరచి చెప్పడం. ఆ రేయి అనుభవానికి ప్రకృతి రూపమిచ్చి అందిస్తానంటోంది. మీ ప్రతిరూపం నాలో ఐదు నెలల ఊపిరి వయసూ పోసుకుందీనాటికి, కన్యగానే మీ సంతానానికి తల్లిని కాబోతున్నానని స్పష్టం చేస్తోంది ప్రకృతి. నేనీ ఆనందంలో తలమునకలవుతూంటే—

నా తల్లిదండ్రులూ, నలుగురూ అంటారుకదా. నేనేమో గర్భం తీయించేసుకోవాలిట. లేకపోతే నాకు పెళ్ళికాదుట. పెళ్ళికాకపోతే నాకు భవిష్యత్తూ ఉండదట, బతుకూ ఉండదట! ఎంత అల్పులూ,



అజ్ఞానులూ వాళ్ళు! జీవితంలోని ఆనందమూ విలువా వారికేం తెలుసని? వాళ్ళెవరూ మీ నవలలు చదవరుగా మూర్ఖులు! నేను వారి పాడుసలహాలనెంత మాత్రమూ వినదలుచుకోలేదు.

ఏదేమయినా నేను మీ వారసుణ్ణే కని తీరుతాను. నాకెందుకో పుట్టబోయేది బాబే అనిపిస్తోంది. ఆ బాబు పెరిగి పెద్దయి మీ లాగా ప్రసిద్ధ రచయితే ఔతాడని నా మనసు నొక్కి వక్కాణిస్తోంది. వాడు... మీవాడు...మీ వారసుడు.. నిశ్చయంగా మీలాగే మహా రచయితవుతాడు. అందుకే మన అభిమాన ఫలాన్ని అర్ధాంతం వేయదలుచుకోలేదు నేను. రేపటి గొప్పరచయిత కుత్తుకను కత్తిరించే కసాయిదానిని కాదలుచుకోలేదు. మీ లాటి మహారచయితను ప్రపంచానికందించాలనే పట్టుదలనాది. సాహిత్యానికి మరో రోజా నందించాలనే నా సంకల్పం.

నాకు పెళ్ళికాకపోతే పోనివ్వండి.

నా భవిష్యజ్జీవితం ముళ్ళదారులలోనే సాగవలసి రానీండి.

నేను మాత్రం మీ వారసుణ్ణే కనితీరుతాను. పెంచి పెద్ద చేసి తీరుతాను.

ఇదే నా నిర్ణయం.

ఇలా వ్రాస్తున్నానని.. నేను మీపీకకి అంపటమవుతానవో, పేరు ప్రసిద్ధులుగాంచిన మిమ్మల్ని రచ్చకీడుస్తాననో భయపడకండి. నాకు నా హద్దులూ తెలుసు, మీ హద్దులూ తెలుసు.

నేను మీ అభిమానినే కాని— చందమామని తెచ్చి గదిలో బంధించాలనుకునే అజ్ఞానురాలిని కాను. అది అసాధ్యమని నాకు తెలుసు.

మీరు నిర్భయంగా ఉండండి. నా రచన వెలరోజులకి నేనే గ్రహణం పట్టిస్తానా? అసంభవం.

నా కడుపులోని మన బాబుని— మీ రొక్కసారి మనసారా ఆశీర్వదించండి—

నువ్వూ నాఅంతటి రచయితవై వర్ధిల్లు అని అది చాలు.

మీరెప్పటికీ రచయితలే. నేనెప్పటికీ మీ అభిమానినే.

మీ ఆశీర్వాదం కోసం ఎదురు చూస్తూ...

మీ అభిమాని — హవిత

ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి—

కవిగారి హృదయం పొంగిపోయింది. గర్వంతో మీసాలు తిప్పుకున్నారు ఓసారి. ఎంత గొప్ప రచయిత తను!

తనకలంతో అభిమానుల అంతరంగాలనే కాదు వారి అందమయిన శరీరాలనూ అమూల్యమయిన కన్యాత్వాలనూ కూడా కొల్లగొట్టగలడు. ఎంత ఘనత యిది!

ఒక అమ్మాయి...కన్య..
తననభిమానించి..
ఆరాధించి...
తనకామె కన్యాత్వాన్నర్పించుకుని—
అనుభవంతో ఆనందించి ఊరుకోకుండా..
ఆ అనుభూతిని శాశ్వతంగా— రూపొందించుకుని నిలుపుకుందుకు—
సమాజాన్నే ఎదిరించి...
జీవితాన్నే పోరాటంగా తీసుకుందుకు కూడా సిద్ధమై....

కన్యమాతకావడానికి కూడా వెనుకాడడంలేదు. తను రాసిన తనువూ మనసూ నవలలో మల్లేనే అచ్చంగా! ఆహా! ఓహో!

ఈ రచయిత గారి రచనా కిరీటంలో...
ఈ అభిమాని హవిత మరో కలికితురాయే.

రచయిత అయిన తనంటే— పాఠక జనాల కెంత వెర్రి! ఎంత పిచ్చి! ఎంత అభిమానం! ఎంత ఆరాధన

రచయితా! వర్ధిల్లు. అభిమానులూ వర్ధిల్లండి!

గాలిలో తేలిపోతున్న కవిగారు—

గాలికి రెపరెపలాడిన పత్రికను— రసభంగం చేసినందుకు శపించబోయి—

అంతలోనే ప్రిన్సిపాలు గారి ట్రంక్ కాల్ జ్ఞాపకం వొచ్చి—

వినుక్కుంటూ పేపరందుకుని— పెద్ద(క్షరాల) వార్తలను చదివేసి— ఆ పేజీ దగ్గర ఆగారు.

"నేను విఫెర్స్‌కి కొడుకుని కనితీరుతాను" అన్న శీర్షికను చూసేసరికి కవిగారికి విచిత్రంగానూ ఇంకా ఏదోలాగానూ అనిపించిందొక్కక్షణం.


శీర్షిక దిగువ వాఙ్మూలం బాగా ఉంది.

"నాకు క్రికెట్టంటే వెర్రి. విఫెర్స్ అంటే పిచ్చి. నేనతని అభిమానిని. ఆరాధకురాలిని. అతనంటే నాకంతా ఇంతా అభిమానం కాదు. అతన్ని మించిన క్రికెట్ ఆటగాడు లేడు. అతను మంచి బ్యాట్స్‌మన్. ఐనా అతన్ని మించిన ఆల్ రౌండరు లేడు. కెప్టెన్‌గా... బౌలరుగా... ఫీల్డరుగా అతనికెవరూ సాటిరారు. ఆయన ఆట టి.వి లో రావాలేకాని నేనేం పొదులుకుని అయినా చూడకుండా ఉండలేను. ఎలాటి పరిస్థితులలో అయినా నేనతని ఆటని చూశానన్నమాటే. అతనంటే నాకు అభిమానం... ఆరాధన... వెర్రి... పిచ్చి... ఇంకేమన్నా ఉంటే అవీను.

ఎన్నాళ్ళనుంచో నాకు నా అభిమాన ఆటగాడిని ప్రత్యక్షంగా చూసి తరించాలని... మాట్లాడి నా అభిమానాన్ని తెలుపుకుని ధన్యురాలిని కావాలని నా కోరిక. ఐదు నెలల కిందట నా కలాటి సువర్ణావకాశం లభించింది. విశాఖపట్నంలో ఆడడానికి తన టీముతో వొచ్చారాయన. స్టేడియంలో వారి ఆట తిలకించాను. వెస్టిండీస్ టీము ముందు మన జట్టు ఏనుగుముందు ఎలకపిల్ల అని మరోమారు రుజువయిందంతే. ఆ రాత్రి.. వారిని దగ్గర నుంచి చూడాలనీ, వీలయితే మాట్లాడాలనీ, ఇంటర్వ్యూ చేయాలనీ వారు బస చేసిన ఐదు నక్షత్రాల హోటలు గదికి వెళ్ళాను. ఆ వేళ పున్నమి. గది ముందు బాల్కనీలో వెన్నెలలో కూర్చుని ఒంటరిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. వెన్నెల స్నానం చేయాలనేమో అండర్ వేర్ తప్ప మరేమీ వేసుకోలేదు వారు. నన్ను చూసి నిలుచున్నారొక్కసారి.

వల్లరాతితో మలచిన శిల్పంలా,
గ్రీకు యోధుడిలా.
పరిపూర్ణ పురుషుడిలా,
మూర్తీభవించిన మగతనంలా—

ఎంతో బాగున్న వారిని చూసి నేనవాక్కయిపోయాను. ఆయన నవ్వుతూ నా వివరాలడిగారు. నేనెవరినో ఎందుకొచ్చానో చెప్పేసరికి తాను నాకు కృతజ్ఞత తెలుపుతూ నా చేయందుకుని చిరునవ్వుతో కరచాలనం చేశారు. ఆ స్పర్శకు నేనూ నాలోని కన్యత్వమూ కరిగిపోసాగాము. వారూ నేనూ ఆంగ్లంలో పాడిపాడి మాటలు మాట్లాడుకున్నాము. వొచ్చీ రాని మాటలు ఊరీ ఊరని ఊరగాయలా అమిత రుచి అంటారు. ఆయన చెబుతున్న చిలిపి కబుర్లు నాకు తేనె కన్నా తీయగా అనిపించాయి. నన్ను నేనే నిగ్రహించుకోలేక. వారి పట్లకల ఆరాధన హద్దులు మీరి పోతుంటే వారి గుండెలమీద వాలిపోయాను బేలగా. ఆయన నన్ను



కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నారు. నేనూ వారిని గట్టిగా కౌగిలించుకుని— నా కౌగిలిలో క్రికెట్ ప్రపంచ మొత్తం ఒదిగిపోయినట్టు మురిసిపోయాను. తరువాత ఆ పరవశంలోనే నేనూ వారూ ఏకమయ్యాం. నా జన్మకది మరచిపోలేని మధురానుభూతే. నా కన్యాత్వమూ, స్త్రీత్వమూ సఫలమయ్యాయి ఆ పొక్క సంగమంలో ఈ జీవితానికి స్వాగతం [illegible]

ఇప్పుడు నా అభిమాన క్రికెట్ ఆటగాడు నా గర్భంలో ఐదునెలల ఊపిరీ, వయసూ పోసుకున్నాడు. తప్పకుండా నా గర్భంలో శిశువు మగవాడే. విఘ్నేష్ ప్రతిరూపమే. అతనంతటి క్రికెట్ ఆటగాడూ అవుతాడు.

నేనేమో నా అభిమాన ఆటగాడి వారసుడిని ధరిస్తున్నానన్న గర్వంతో ఉంటే నా చుట్టుపక్కలవారు, జరిగిందేదో జరిగింది, గర్భవిచ్ఛిత్తి చేసుకో అని సలహాలిస్తూ 'లేకపోతే నీ జీవితమంతా నిష్ఫలమయిపోతుంది. నీకు పెళ్ళికాదు. సంఘంలో గౌరవముండదు. కన్యామాతగా బతకలేవు' అని బెదిరిస్తున్నారు!


నా గర్వాన్నీ గర్భాన్నీ విచ్ఛిన్నం చేసుకుంటూనా నేను వ్రేలికోనానికి జడిసి? ఊహు నేనెంత మాత్రమూ నాలోని విఘ్నేష్‌ని చంపను. చంపుకోను. నా బిడ్డ నా ఆరాధనా ప్రతిరూపం. అభిమాన ఫలం. పెంచి పెద్దచేసి తీరుతాను. భారత దేశానికొక విఘ్నేష్‌నందించి తీరుతాను. ఎన్నికష్టాలయినా ఎదుర్కొంటాను నా ధ్యేయసాధనలో. జరిగిన దానికి నేను గర్వపడుతున్నానేకాని సిగ్గుపడడంలేదెంతమాత్రమూ. నేను ఖచ్చితంగా విఘ్నేష్‌కి కొడుకుని కని తీరతాను"

ఈ అమ్మాయిది భారతదేశమూ, ఇరవయ్యేళ్ళ వయసూ, రెండేళ్ళ వైద్యవిద్యాభ్యాసమూ అని ముగించాడు విలేకరి.

చదివిన కవిగారికి విఘ్నేష్‌మీద ఒక్కసారసూయ వేసింది. నిశ్చయంగా ఇది అతనికి గర్వకారణమే. అతని టోపీలో మరొక కుచ్చే. అతనిమీదుండే పిచ్చికి తార్కాణమిది.

హవిత కూడా సుప్రసిద్ధరచయిత అయిన తన పేరు బయటపెడుతూ ఏ పేపరులోనో ప్రకటన యిస్తే తన మీద పాఠకుల పిచ్చి మరింత పెరిగేది. సంచలనం కలిగించే వార్తలయి తనకి ఆకర్షణా పలుకుబడీ మరింత పెరిగేవి.

ఇంతకీ ఆ ప్రిన్సిపాలుగారు పనిమాలి తననిది చదవమని అంతదూరం నుంచి ట్రంక్ కాల్ చేసి మరీ చెప్పడంలో ఆంతర్యమూ, అంతరార్థమూ ఏమిటో? ఇంకేమిటి? ఆ ముసిలాయనకిటువంటివి నచ్చక.. తమకళాశాల పరువుపోతూందని.... ఇలాటి అభిమానం అమ్మాయిలకి కనువిప్పుకలిగేలా ఓ నవల వ్రాయుమని అడగడానికయి ఉంటుంది. అంతే రాయడం కష్టమూ కాదు, ఆంగ్లంలో ఇటువంటి విషయం మీద ఇదివరకెవరయినా రాసిన నవలదొరికితే.




"లోపలికి రావొచ్చునా?"

కవిగారటుచూసి—

"అర్థాంగివి. నీకు అభ్యంతరాలూ అనుమతులూ ఏమిటి?" అని నవ్వారు. ఆమె లోపలికి వచ్చి కూర్చుని.... "పేపరులో ఆ మెడికో అమ్మాయి గురించి..!"

"చదివాను ఇప్పుడే..." అన్నారాయన కొంచెం అసహనంగా "ఈకాలం అమ్మాయిలు పప్పుముద్దలు కారు. సాహసులు. స్వతంత్రమయిన అభిప్రాయాలు, అనుకున్నది చేసి తీరుతారు. కోరుకున్నది అందుకుంటారు. ఆ చొరవా, తెగింపూ, సాహసమూ..."

"బాగానే ఉందంతా. కానీ ఆ అమ్మాయి భవిష్యత్తు? కనడానికేం కష్టపడాలి? విఘ్నేష్‌కి కొడుకుని కంటుంది. కానీ ఆ అవివాహిత మాతకు పెళ్ళయ్యేదెలా? ఆమె జీవితం గడచేదెలా? ఈ సమాజం ఆమెను సవ్యంగా బతకనిస్తుందా? ఆడపిల్లలు తెలివిమీరుతున్నారు సరే. మగవాళ్ళ హృదయాలనీ సంస్కారాలనీ విశాలం చేసుకోవడంలేదుగా?" ఆవిడ కంఠంలో బాధ.

కవిగారు అవకాశం తీసుకున్నారు. "చూడూ! అసలు మానవ జీవితమంటే కొన్ని క్షణాలు మాత్రమే. ఆ క్షణాలు లేదా నిమిషాలలోనే మనుషులు నిజంగా జీవిస్తారు. కోరుకున్నది అందే క్షణాలన్నమాట మనుషులు బతికేది ఆ క్షణాలనందుకుందుకే. వాటి కోసం ఎదురు చూస్తూనే జీవితం గడుపుతారు. కొందరి కవి జీవితం ముందు భాగంలోనే అందుతాయి. వాటి స్మృతులతో వారు ఒక జీవితంకాదు, రెండు జీవితాలయినా గడపగలరు..."

"కథల మాటలు బతుకునింపవు. అమాయకంగా... ఆరాధనకి తనని బలి చేసుకున్న ఆ అమ్మాయి, జీవితాన్ని బజారుపాలు చేసుకున్నట్లే. ఈ పిచ్చి ఎన్నాళ్ళో మిగలదు. జీవితపు మాత్రమీది అందమైన అభిమానం తీపిపూత అతిత్వరలోనే కరిగిపోతుంది. వాస్తవికత తెలిసివొస్తుంది. జీవితమంటే కథలూ నవలలూ, క్రికెట్టూ, టెన్నీసూ, సినిమాలూ, టీ.వీలూ కావని తెలిసివొచ్చేసరికి ఆమెకు మిగిలేదేమిటి, కాలిపోయిన చేతులూ బతుకూ తప్ప?" ఆవిడ కంఠంలో గద్గదికతా, కన్నీళ్ళూ.

"సినిమాలో నాయిక కష్టాలు చూస్తూ కన్నీరు కార్చే ఆడవాళ్ళకో వేనీదీను ఎవరిగురించో మనస్సెందుకూ తెగచింతించెయ్యడం? ఓహో! స్త్రీపక్షపాతమా!"

"ఏమన్నా అనండి. ముందా పిల్ల రేపటి బతుకెలా బతకాలో ఆలోచించండి" ప్రార్థిస్తున్నట్లే అంది కవిగారి శ్రీమతి.

"స్నానం చేసిరానీ...." లేచిపోయారాయన.

"స్నానం చేస్తూ ఆలోచించండి. మీ కలవాటేగా? ఇన్నాళ్ళూ మీ నవలలగురించి ఆలోచించేవారు. ఈ ఒక్కసారికీ ఈ అమ్మాయి గురించి ఆలోచించండి"

"అలాగేలే" అని స్నానాలగదిలోకి వెళ్ళిపోయారాయన.

రాత్రంతా మత్తుతో జోగి— నరాలలో విస్కీ ప్రవహిస్తూ, కంపుకొడుతున్న శరీరం మీద చల్లని నీళ్ళు పడుతూంటే— శరీరానికి మనసుకి హాయిగా ఉంది. మెదడు అందమయిన హవిత, ఆరాధన, అభిమానం వంటి విషయాల మీదకే కాని బతుకు బాధ్యత లాటి క్షుద్ర విషయాలమీదకి పోలేదు.


స్నానంచేసి వొచ్చేసరికి కాఫీ అందించారావిడ. "నేను చెప్పిన విషయం ఆలోచించారా?"

"లేదు" చిరాకేసింది కవిగారికి "అయినా అడ్డమయిన వాళ్ళ గురించీ నేనెందుకాలోచించాలి?"

ఆదేక్షణంలో టెలిఫోన్ మోగింది. విశాఖపట్నం నుంచి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్. "ఆ.. నేనే చదివాను. అయినా నేనెందుకూ చదవడం? ఆ వార్తకీ నాకూ సంబంధమా! ఎలాగ?"

"ఆ అమ్మాయి 'మా శైలూషి!" ఆయన చేతిలోంచి రిసీవరు జారిపోయింది. ఎంతో తెలివయినదనుకున్న శైలూషి తన అమ్మాయి... విఘ్నేష్‌తో... ఛీ ఛీ... దరిద్రం.. అర్థరహితం... అయినా.... ఆ వర్లక్‌ొరిని

99ని డాక్టర్స్ నంబర్ అంటారు. నైన్‌టీనైన్ అని పదే పదే అంటే ఊపిరితిత్తుల సంకోచ వ్యాకోచాలు పెరుగుతాయి అందుకనే 99కి అంత ప్రాముఖ్యం.



కి... అడవి మనిషికి... ఎంతో అందమయిన శైలూషి తన కన్యత్వాన్నెలా ధారపోసింది? వాడొట్టి మృగం. వాడికైనా బుద్ధీ జ్ఞానం ఉండక్కర్లేదూ! ఆడపిల్ల... అందమయినది... అమాయకురాలు.. దొరికిందే చాలని... నాశనం చేస్తాడా! తెలిసీ తెలియని తనాన్ని తెలివిగా వాడుకుంటాడా! గొణుక్కున్నారు కవిగారు, కసిగా "నేనిప్పుడే బయలు దేరి వస్తున్నాను. నేను వొచ్చేవరకూ శైలూషిని జాగ్రత్తగా చూడండి. ప్లీజ్..."

వణికిపోతున్నారు కవిగారు.

"మీరు విశాఖపట్నం వెళ్తున్నారా?"

"వెళ్ళక? శైలూషి అలాంటిపని చేశాక... వెళ్ళకుండా ఎలా ఉండగలను? నువ్వు వస్తావా? అవసరమయితే నువ్వో నాలుగు మాటలు చెప్పవొచ్చు"

"ఒక షరతు మీదయితే వస్తాను"

"షరతా! ఏమిటి?" ఆశ్చర్యంగా చూశారాయన

"విశాఖపట్నం చేరగానే మనం ముందు హానిత దగ్గరకి వెళ్ళాలి"

"హానితా!" కవిగారు తేలుకుట్టిన దొంగలా తల వొంచుకున్నారు.

"భార్యని.... అర్ధాంగిని... కనుకా.. ఆ ఉత్తరం అతి ప్రత్యేకంగా మీ పరుపుమీద ఉండడమూ... మీరు స్నానం చేసేంత సేపూ ఒంటరిగా కాలక్షేపం లేకుండా మిగలడమూ వీటితో ఆ ఉత్తరాన్ని చదవకుండా ఉండలేకపోయాను... పైగా దానిని చూసి మీరు వొదిలేశారు" తప్పు వొప్పుకుంటున్నట్లున్నారావిడ.

"అది నేరమేమీ కాదు కాని నేనిప్పుడేం చెయ్యాలో చెప్పు" కరవరణాలాడుతున్నట్లు కంగారు పడుతూ అన్నారు కవిగారు.

"సుప్రసిద్ధ రచయిత అయిన మీకు సామాన్యురాలినయిన నేను సలహా చెప్పడమా! సాహసమేమో? కథంతా తెలిసిన నేను చెప్పవలసిందీ చెప్పగలిగిందీ ఒక్కటే"

"ఏమిటి?" అయోమయంగానూ, ఆశగానూ చూశారాయన.

"శైలూషి మనమ్మాయయితే, హానిత నా అమ్మాయి. ఇద్దరికిద్దరూ తెలిసీ తెలియని వయస్సులో ఆరాధనాభిమానాల పేరిట జీవితాలను భగ్నం చేసుకున్నారు. ఇద్దరి ప్రస్తుత పరిస్థితి ఒకటే. మీ కథల పరిభాషలో, శైలూషి, హానితా ఒకే నావలో పయనిస్తున్న అభాగినులయిన అమ్మాయిలు. హానిత పాలిట మీరు రాక్షసులయితే మీ అమ్మాయి శైలూషి పాలిట విభర్వ్ రాక్షసుడు!

మీరు ప్రసిద్ధ రచయిత. విభర్వ్ విశ్వవిఖ్యాత క్రీడాకారుడు. మీ వంటి పేరు పొందిన ప్రఖ్యాత పురుషులున్నారే, వారు క్రూరులయిన వింతదీపాలు. దూరానికి ఇంద్రజాలపు వెలుగుని ప్రసరిస్తూ... ఆ వెలుగుని చూసి ఆకర్షింపబడి... అభిమాన ఆరాధనంతో దరిచేరే అజ్ఞానపు ఆడపిల్లలను అగ్నితో దహించే దీపాలు మీరు. మీలో వెలుగుకంటే వేడే ఎక్కువేమో.

నిజంగా మీ మగదీపాలకు కావలసింది. ఆడపిల్లల ఆరాధనా హారతి పళ్ళాలుకావు. ఆ పాపలను మీకబంధకామహస్తాలతో బంధించి... మీ వేడితో ఆశాంభాల రెక్కలు మాడ్చి గర్వంగా మీసాలు మెలివేసుకునే మహాపురుషులు మీరు. ఇక ఆ అభిమానులకు మిగిలేది బూడిదా, బూడిదయిన బతుకే. ఇది భారత దేశం. ఇక్కడ... ఈ వ్యవస్థలో... కన్యత్వం కోల్పోతనే కళ్యాణం కాదు అమ్మాయికి. అవివాహిత మాతృకకేం మిగులుతుందని? ఈ గడ్డమీద ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి గిట్టే కడతేరేవరకూ బతుకంతా ధారావ్రతమే. మీలాంటి ప్రఖ్యాతపురుషులు.... మీ గొప్పతనంతో...అవివాహిత మాతలను తయారు చేస్తూ సమాజానికి కొత్త సమస్యను సృష్టిస్తున్నారు! మీవంటి రచయితలకీ, క్రీడాకారులకీ ప్రజలమాయకంగా నెత్తిన కిరీటాలు పెడుతున్నారు! మీ అమ్మాయిని నాశనం చేశాడని విభర్వ్‌ని సల్లకొరికినీ, అడవి మనిషని అన్నారే! మరి మీరో? మీరేమయినా మన్మథులా? అవివాహితులా? హానితను వివాహం చేసుకునే అర్హత కలవారా? మీరే ప్రఖ్యాత రచయితకాకపోతే ఆ వివాహ వరింపులో తాతగారూ అనిపించేది కదూ హానిత? మీ పేరు ప్రఖ్యాతులమిచ్చలోనే కదా ఆ అమాయకపు ఆడపిల్ల అన్నీ మరచిపోయింది! మీరు రచయితలే! అనుభవశాలులే! వయోవృద్ధులే! ఆ సమయంలో మీ వివక్షాజ్ఞానమూ, ఆత్మవిమర్శా ఏమైపోయాయి? ఆరాధనకొద్దీ చూడవొచ్చిన అమాయకపు ఆడపిల్లను అధః పాతాళానికణగ్గ దొక్కుతారా!

శైలూషిదీ హానితదీ ఒకే రకమయిన పరిస్థితి కనుక పరిష్కారమూ ఒకటే కావాలి. నన్ను స్త్రీజనపక్షపాతి అనుకున్నారే. మళ్ళీ చెబుతున్నాను. శైలూషి మనమ్మాయి. ఐతే హానిత నా అమ్మాయి. ఒకరికొక న్యాయమూ మరొకరికి మరో న్యాయమూ ఐతే అది అన్యాయమే. వాళ్ళిద్దరూ ఒకే దారి... ఒకరు ప్రసిద్ధ రచయిత చేతిలోనూ, మరొకరు సుప్రసిద్ధ క్రీడాకారుడి కౌగిలిలోనూ తమ అమూల్య కన్యత్వమూ స్త్రీత్వమూ కోల్పోయి, తల్లులు కాబోతున్న అమాయకపు ఆడపిల్లలు. వాళ్ళిద్దరికీ మీరే న్యాయం చెయ్యాలి. అది మీ బాధ్యతా, కర్తవ్యమూ. మీరు రచయితలు. సమాజోద్ధరణకు కంకణం కట్టుకున్నవారు... ప్రజల దృష్టిలో. కనుక ముందు హానిత సంగతి చూడడమే ధర్మం. మీరలాగే అంటే నేను మీతో రాగలను. నేను మామూలు ఆడదానిని. ఆవేశం కొద్దీ ఆవేదనకొద్దీ అపభ్రంశపు మాటలేమయినా అని ఉంటే నన్ను క్షమించండి"

అంటూ ప్రయాణానికి పెట్టెలో బట్టలు సర్దసాగారావిడ. జుట్టుపీక్కోబోయి ఆగిపోయారు కవిగారు, ఏదో జ్ఞాపకం వచ్చినట్టు. పాపం కవిగారిది కనీసం బట్టతలయినా కాదు. ఒయాసిస్ లేని ఎడారిలాంటి... ఒక్క వెంట్రుకా లేని బోడిగుండు! అత్యవసర పరిస్థితుల్లో అయినా పీక్కుందుకు వారికి జుట్టులేదు! పాపం.

